
ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 103 | ఆదివారం 11 జనవరి 2026 | పేజీలు - 6 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



## నాగరికతలో ముందున్నది
# నదీతీరాల్లోని నగరాలే

"లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలూ నదీతీర ప్రాంతాల్లోనే ఉన్నాయి. నదీ గర్భానికి.. నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా వైకాపా నేతలు మాట్లాడుతున్నారు.. చంద్రబాబు..

**నీటి విషయంలో గొడవలు పడితే నష్టపోయేది తెలుగు ప్రజలే**

- నాగరికత తెలిస్తే నదుల గురించి మాట్లాడరు
- నదీ తీరాల్లో నాగరికత వెల్లి విరిసింది
- సింధూ నాగరికత గురించి జగన్ చదివితే మంచిది
- మీడియాతో ముఖ్యమంత్రి

**అమరావతి (తెలుగోడు), జనవరి 10 :**
నీటి విషయంలో గొడవలు పడితే నష్టపోయేది తెలుగు ప్రజలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండు తెలుగురాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాయలసీమకు నీరందించామనటానికి పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే ఉద్యానరంగం అభివృద్ధి చెందిందన్నారు. పూర్తిచేయకుండా 2020లోనే నిలిపివేసిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం మట్టిపనులు చేసి రూ.900కోట్లు బిల్లులు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, నీటి విషయంలో రాజీపడేది లేదని మరోసారి స్పష్టం చేశారు. జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి దుష్ప్రచారం చేయరని చంద్రబాబు అన్నారు. సింధు నాగరకత ఎలా వచ్చిందో అతను తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. దేశ రాజధాని దిల్లీ సహా ప్రధాన నగరాలు ఎక్కువగా నదీ తీరాల వెంబడి ఉండబట్టే అభివృద్ధి చెందాయని తెలిపారు. నదులు ఎక్కడ పుడతాయో, 2లో

## అమరావతిలో అవినీతిపై
# ప్రశ్నిస్తే తప్పేంటీ..!

- తన తందానా కంపెనీలకే బాబు కాంట్రాక్టులు..
- కేవలం నీళ్లు తోడేందుకే వేల కోట్లు వృధా..
- సిఎం విశాఖలో కూర్చుంటే మరింత అభివృద్ధి ..
- సజ్జల రామక్రిష్ణారెడ్డి..



**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 10 :**
అమరావతిలో అన్యాయం, అవినీతి జరుగుతుంటే ప్రశ్నించడంలో తప్పేముందన్నారు వైఎస్సార్సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి. తన తందాన కంపెనీలకే బాబు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని, ఆ కంపెనీల నుంచి 4 శాతం కమీషన్లు బాబు తీసుకుంటున్నారని సజ్జల స్పష్టం చేశారు. ఈరోజు(శనివారం, జనవరి 10వ తేదీ) తాడేపల్లి నుంచి మీడియాతో మాట్లాడిన సజ్జల.. మొబలైజేషన్ అడ్వాన్సుతో బాబు అండ్ కో దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. తాము ఎప్పుడూ అమరావతిని తక్కువ చేయలేదని, అమరావతి పేరుతో చంద్రబాబు చేస్తున్న స్కామ్లను ప్రశ్నిస్తున్నామన్నారు.. (మిగతా 2లో)

'చంద్రబాబు అమరావతి మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్. అమరావతిలో నీళ్లు తోడటానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వైఎస్ జగన్ ఇల్లు ఉన్న ఏరియా, అమరావతి ఒక్కటైనా.. అమరావతిలో నీళ్లు తోడటానికి వేల కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారు. మేం అమరావతిని తక్కువ చేయలేదు.. చంద్రబాబు అక్రమ నివాసంలో ఉన్నారు.. ఇప్పుడు ఇల్లు కడుతున్నారు.
సజ్జల రామక్రిష్ణారెడ్డి...

## ఘనంగా ముగిసిన
# ఆవకాయ్ ఉత్సవాలు



**రెండ్రోజుల పాటు ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**విజయవాడ (తెలుగోడు), జనవరి 10 :**
విజయవాడలోని పున్నమి ఘాట్‌లో రెండో రోజు ఆవకాయ అమరావతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సినిమా, సంస్కృతి, సాహిత్యాల సమ్మేళనంగా కొనసాగిన ఈ ఉత్సవాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణానది తీరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు 2లో

# గోదావరి జిల్లాల్లో లక్షల్లో గదుల అద్దెలు

**గోదావరి జిల్లాల్లో హొటల్ రూములకు భారీ డిమాండ్...**

- కోడి పందేల్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటి స్పీకర్ ప్రకటన..
- గోదావరి జిల్లాలకు భారీగా చేరకుంటున్న జనం..
- పట్టణాల్లోని హొటళ్ల గదులన్నీ ఫుల్.. భారీ అద్దె వసూళ్లు..
- సంక్రాంతి జోష్‌తో కిటకిటలాడుతున్న గోదావరి జిల్లాలు..



**భీమవరం (తెలుగోడు), జనవరి 10 :**
గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పండుగ అంటే ఇక చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఇక్కడి పచ్చదనం మధ్య కోడి పందాలు ఆడుకుంటూ సరదాగా పిండివంటలు ఆరగిస్తూ సంక్రాంతి జరుపుకోవాలని ఎవరికి మాత్రం ఉండదు. దీంతో ప్రతీ ఏటా సంక్రాంతి వచ్చిందంటే చాలు గోదావరి జిల్లాల రూపురేఖలే మారిపోతుంటాయి. ఈసారి కూడా అదే జోష్ తో సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనం తరలివస్తున్నారు.గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పండుగ ఒక ఎత్తు.. భీమవరంలో మరో ఎత్తుగా ఉంటుంది. ఇక్కడ జరిగే కోడి పందాల్ని చూసేందుకు, ఆడేందుకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి భారీగా జనం తరలివస్తుంటారు. వీరంతా మూడు రోజుల పాటు అక్కడే ఉండి కోడి పందాల్ని తిలకించేందుకు వీలుగా స్థానికంగా హొటల్స్ అద్దెకు (మిగతా 2లో)

# కూటమికి 3 రాజ్యసభ సీట్లు

- వైసీపీ రాజ్యసభ సీట్లు కూటమి ఖాతాలోకి..
- 73 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ...
- రాష్ట్రం నుంచి మెజార్టీ వాటా తీసుకోనున్న బిజెపి..



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 10 :**
ఏపీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కూటమి - వైసీపీ మధ్య కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో వైసీపీ నుంచి పెద్ద సంఖ్య లో నేతలు కూటమి పార్టీల్లో చేరారు. ఇప్పుడు చేరికలు నిలిచిపోయాయి. కాగా.. కూటమి పైన ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని జగన్ పదే పదే చెబుతున్నారు. జగన్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో మరో మూడు వైసీపీ రాజ్యసభ స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లనున్నాయి. ఇందుకు ముహూర్తం ఖరారైంది.ఏపీలో కూటమికి రాజ్యసభ సభ్యుల సంఖ్య పెరగనుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసారు. అందులో విజయ సాయిరెడ్డి రాజకీయాలకు ప్రస్తుతం దూరంగా ఉన్నారు. అదే విధంగా బీదా మస్తానరావు, మోపిదేవి వెంటక రమణ టీడీపీలో చేరగా.. ఆర్ క్రిష్ణయ్య బీజేపీ కండువా కప్పుకున్నారు. దీంతో.. ప్రస్తుతం పెద్దల సభలో వైసీపీ బలం 7కి పడిపోయింది.కాగా, మరో ముగ్గురు వైసీపీ సభ్యుల స్థానాలు కూటమి ఖాతా లో చేరనున్నాయి. 73 మంది రాజ్యసభ ఎంపీలు ఈ ఏడాది పదవీ (మిగతా 2లో)

# అదుపులోకి వచ్చిన బ్లోఔట్

- పూర్తిగా ఆగిపోయిన మంటలు..
- స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జిసి..
- ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు..
- సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయం..



**కోనసీమ (తెలుగోడు), జనవరి 10 :**
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. (మిగతా 2లో)

# జగన్ ఓ పెద్ద దోపిడీదొంగ

**రాయలసీమకు నీటిని శాశ్వతంగా తరలించే ఏర్పాట్లు చేస్తున్న చంద్రబాబు**

- వ్యవస్థలన్నింటినీ నాశనం చేసిన వైయస్ జగన్..
- రాయలసీమకు తీరని ద్రోహం చేసింది జగనే..
- ఎత్తిపోతల పథకం పేరుతో వేల కోట్లు వృధా..
- బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత..



**పెనుకొండ (తెలుగోడు), జనవరి 10 :**
సీఎం చంద్రబాబు అపరభగీరథుడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితఅన్నారు. రాయలసీమకు నీటిని శాశ్వతంగా తరలించే ఏర్పాట్లు సాగుతున్నాయని అన్నారు. అయితే జగన్ అతిపెద్ద దొంగ అని మండిపడ్డారు. పెనుకొండ లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేసి, వేలకోట్లు దోచుకున్న అతిపెద్ద దోపిడీ దొంగ అని విమర్శించారు. రాయలసీమకు తీరని ద్రోహం చేసిన ఆయన, దయ్యాలు వేదాలు వల్లించినట్లు కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. తాడేపల్లిలో ఇంటిని నిర్మించుకుని అమరావతే రాజధాని అని అక్కడి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. ఐదేళ్లపాటు రాజధాని లేకుండా పాలించిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకోవడానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పేరుతో జగన్ పెద్ద కుట్రకు తెరలేపారని అన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను కాంట్రాక్టు సంస్థకు అప్పగించారని, రూ.900 కోట్లు ఖర్చుచేశారని (మిగతా 2లో)

## బాబువి డొంకతిరుగుడు
# సమాధానాలు

- ఏపీ ప్రయోజనాలను తుంగలోకి తొక్కేస్తున్న చంద్రబాబు..
- రేవంత్ అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పని సిఎం...
- మాజీ మంత్రి బుగ్గన...




**నంద్యాల (తెలుగోడు), జనవరి 10 :**
రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా సీఎం చంద్రబాబు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. ప్రాజెక్ట్ విషయంలో నాలుగు గోడల మధ్య జరిగిన సంభాషణపై స్పష్టత ఇవ్వాలని బుగ్గన డిమాండ్ చేశారు.మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నంద్యాలలో మీడియాతో మాట్లాడుతూ 'తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం రాయలసీమకు ద్రోహం చేస్తున్నాడు. రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా చంద్రబాబు (మిగతా 2లో)

# హైదరాబాద్ - విజయవాడ.. భారీ రద్దీ

- వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ
- ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని పోలీసుల సూచన


**విజయవాడ (తెలుగోడు), జనవరి 10 :**
సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా రెండో రోజు శనివారం ఉదయం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ఎ÷-లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో (మిగతా 2లో)



# బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

- ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో మార్పులు
- రెండ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం

**అమరావతి (తెలుగోడు), జనవరి 10 :**
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం బలపడుతూ కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ప్రభావం వల్ల ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడిన మార్పులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. వాయుగుండం వల్ల ఏపీలో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రస్తుతం దక్షిణ భారత తీరం వైపు పయనిస్తోందని తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, శ్రీలంక తీర ప్రాంతాల్లో వాతావరణం వేగంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. వాయుగుండం ప్రభావం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో మేఘావృత వాతావరణం (మిగతా 2లో)



# అదుపులోకి వచ్చిన బ్లోఔట్



(మొదటి పేజి (తరువాయి)

మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500-600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

**అధికారుల్ని అభినందించిన మంత్రి అచ్చెన్న..**

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి రావటంపై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ వేల్‌కు బీఓపీ ఫిక్స్ చేసిన ఓఎన్జీసీ అధికారులను మంత్రి అభినందించారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని ఆయన తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. మలికిపురం మండలం ఇరుసుమండ సమీపంలో ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు అధికారులు. కాగా, ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే తప్పేంటి

(మొదటి పేజి (తరువాయి)

'విశాఖలో సీఎం కూర్చుంటే మరింత అభివృద్ధి అని చెప్పాం. అమరావతిని వైఎస్సార్సీపీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తుంది. చంద్రబాబు బెదిరింపులు అరుపులు కాకుండా సూటిగా సమాధానం చెప్పాలి. గొంతెత్తి. కళ్లు పెద్దవి చేసి బెదిరిస్తే సమాధానం దొరకదు. రూ. లక్ష కోట్ల అప్పుకు ఏడాదికి రూ.8 వేల కోట్ల వడ్డీ కట్టాలి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణ రోజుకు 8 టీఎంసీలు వాడుకుంటుంది. 777 అడుగుల నుంచే తెలంగాణ నీళ్లు తోడుకుంటుందే రాయలసీమ ప్రయోజనాలు ఎలా?, రాయలసీమ హక్కుల పరిరక్షణలో చంద్రబాబ విఫలమయ్యారు. ఆర్గనైజ్డ్ మీడియా టెర్రరిజంతో నిజాలను ప్రజల్లోకి వెళ్లకుండా చేస్తున్నారు. చంద్రబాబు సైలెంట్ ఉండటం అంటే రేవంత్ చెప్పింది నిజమే అని అర్థం చేసుకోవాలివిష, అబద్ధపు ప్రచారంలో చంద్రబాబు పీహెచ్డ్ చేశారని సజ్జల విమర్శించారు. పాస్ పుస్తకాలపై క్యూఆర్ కోడ్ అనేది వైఎస్ జగన్ ఉన్నప్పుడే ఉందని, ఇప్పుడు దాన్ని చంద్రబాబు తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు విదేశీ పర్యటనకు వెళితే అందులో దాపరికం ఎందుకని ప్రశ్నించారు.'లక్ష 80 కేజీల గోమాంసం విశాఖలో పట్టుబడితే ఏం చేశారు. క్వశ్చన్ చేసే వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో వేస్తున్నారు. మేం అడిగిన ప్రశ్నలకు బాబు సమాధానం ఇవ్వకుండా.. మమ్మల్ని ప్రశ్నలు అడుగుతాడు. అధికారం వచ్చాక కూడా వారంలో మూడు, నాలుగు రోజులే బాబు ఇక్కడ ఉంటున్నారు. ప్రతివారం హైదరాబాద్లో చంద్రబాబు, లోకేష్లకు ఏం పని? అని నిలదీశార సజ్జల.చంద్రబాబు అరాచక పాలన నుంచి ఏపీని కాపాడుకుందామన్నారు సజ్జల ' వైఎస్ జగన్ హయాంలో రూ.3.30 లక్షల కోట్లు అప్పు చేశారు. రూ.3.30 లక్షల కోట్లలో రూ.2.73 లక్షల కోట్లు డీబీటీ ఇచ్చాం. చంద్రబాబు రెండేళ్లు తిరగకుండానే రూ. 3 లక్షల కోట్లపైగా అప్పు చేశారు. చంద్రబాబ పాలనను ప్రజలు, విజ్ఞులు మేధావులు ప్రశ్నించాలి' అని విజ్ఞప్తి చేశారు.

# బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం



(మొదటి పేజి (తరువాయి)

నెలకొంది. ముఖ్యంగా తూర్పు దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా వర్షపాతం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతితో పాటు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీవ్ర వాయుగుండం ప్రభావం ఏపీపై పూర్తిగా లేకపోయినా, దాని అనుబంధ ప్రభావంతో కొన్ని జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర శ్రీలంకలోని ట్రింకోమలీ జాఫ్నా మధ్య ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటిన తర్వాత ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గంటకు సుమారు 13 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం వాయువ్య దిశగా కదులుతోందని తెలిపారు. ఈ వాయుగుండం శ్రీలంక తీరాన్ని దాటే సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పాటూ బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. నైరుతి బంగాళాఖాతంలో సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఏపీ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా తీర ప్రాంతాల్లో సముద్రం ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. వర్ష సూచన ఉన్న జిల్లాల్లోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కోత దశలో ఉన్న పంటలను రక్షించుకోవాలని పేర్కొన్నారు. నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని తెలిపారు. పంట పొలాల్లో కాలువలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నెల్లూరు, తిరుపతి వంటి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం ఉన్న చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర కోస్తాలో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. చలి ప్రభావం దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించింది. ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. అవసరమైతే సహాయక చర్యలు చేపట్టేందుకు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే 24 నుంచి 48 గంటల్లో వర్ష తీవ్రత క్రమంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. శ్రీలంక తీరం దాటిన తర్వాత వాయుగుండం బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. అయితే స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు అనూహ్యంగా కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# నదీ తీరాల్లోని నగరాలే

(మొదటి పేజి (తరువాయి)

నాగరికత ఎక్కడ మొదలైందో జగన్ కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్ పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలూ నదీతీర ప్రాంతాల్లోనే ఉన్నాయని వివరించారు. నదీ గర్భానికి.. నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా వైకాపా నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మటం మానట్లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నీటిని సద్వినియోగ చేసుకుంటున్నాం కాబట్టే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే ఉద్యాన రంగంలో మొదటి స్థానంలో ఉన్నాం.. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి వెళ్తామని పేర్కొన్నారు.ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మనల్ని చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా?. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్న విషయం ఆయనకి అర్థం కావడం లేదు. రాయలసీమకు నీరు అందించామన డానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు క్లయిమ్ చేసుకున్నారంటే ఆ ప్రభుత్వంలో దోపిడి ఏ విధంగా జరిగిందన్న విషయం ప్రజలు గమనించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చే సత్తా మాకుంది. తెలంగాణతో మాకు ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటాం. రాజకీయాల కోసం సెంటిమెంట్లు రెచ్చగొట్టం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

# హైదరాబాద్ - విజయవాడ.. భారీ రద్దీ

(మొదటి పేజి (తరువాయి)

సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం అని పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు ఒక గంటలో చేరుకోవచ్చు కానీ.. నిరుడు 'భోగి' ముందు రోజు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడం మేలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

# ఘనంగా ముగిసిన ఆవకాయ్ ఉత్సవాలు

(మొదటి పేజి (తరువాయి)

ఉత్సవ వాతావరణాన్ని మరింత సొగసుగా మార్చాయి. సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు సినీ సాహిత్యంపై జరిగిన చర్చలు మంచి స్పందన పొందాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు పున్నమి ఘాట్‌ను కళా, సాంస్కృతిక వేదికగా నిలిపాయి. ఈ కార్యక్రమాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీకళ తదితరులు హాజరై కళాకారులను అభినందించారు. కాగా, రాష్ట్ర సంస్కృతి, వంటకాలు, సృజనాత్మక రంగాలను ప్రోత్సహించేలా ఈ ఫెస్టివల్‌లో 28 ప్రత్యేక ఈవెంట్లు, 4 వర్క్‌షాప్‌లు నిర్వహించారు.. ప్రపంచంలో ఫుడ్ అంటే భారతదేశం.. భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు వచ్చే స్థాయికి మన వంటకాలకు ఖ్యాతి ఉంది అంటూ ఆంధ్ర వంటల గొప్పదనాన్ని సీఎం చంద్రబాబు.. ఈ ఉత్సవాల ఆరంభంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉత్సవాలు, సంబరాలు లేక ప్రజల్లో నవ్వులు కూడా కరువయ్యాయని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్, అమ్మవారి దసరా ఉత్సవాలను ప్రపంచస్థాయిలో నిలబెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు దసరా అంటే విజయవాడ గుర్తుకు వచ్చేలా ఉత్సవాలు నిర్వహించాం అని చెప్పారు. ఇక, తెలుగు సినీ చరిత్ర గురించి ప్రస్తావించిన సీఎం చంద్రబాబు.. భక్త ప్రహ్లాద నుంచి బాహుబలి వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో ప్రయోగాలు చేసింది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణాజిల్లా నుంచే వచ్చి సినిమా రంగానికి దిక్సూచిగా నిలిచారు.. పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు తెలుగు సినిమాను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్నారు అని కొనియాడారు. కృష్ణాజిల్లా సంపద సృష్టిలో, వ్యాపార చొరవలో ఎప్పుడూ ముందే ఉంటుందని సీఎం ప్రత్యేకంగా ప్రశంసించిన విషయం విదితమే..

# లక్షల్లో గదుల అద్దెలు

(మొదటి పేజి (తరువాయి)



తీసుకుని బస చేస్తారు. దీంతో ఈసారి కూడా హోటల్ రూమ్స్ కు భారీ డిమాండ్ ఏర్పడింది. భీమవరంతో పాటు ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురంలో ఇప్పుడు హోటల్ గదులు పూర్తిగా బుక్ అయిపోయాయి. ఒక్కటంటే ఒక్క రూమ్ కూడా ఖాళీ లేదని తెలుస్తోంది. రోజుకు వెయ్యి నుంచి 5 వేలు ఉంటే హోటల్ అద్దె కాస్తా ఇప్పుడు 30 నుంచి 60 వేలకు చేరిపోయిందని చెప్తున్నారు. మూడు రోజులకు తీసుకుంటే గరిష్టంగా లక్ష వరకూ చెల్లించక తప్పడం లేదట. ఇందులో రాజకీయ నాయకులతో పాటు సాధారణ పర్యాటకులు కూడా భారీగానే బస చేస్తున్నారు.మరోవైపు కోడి పందాలు కూడా ఈసారి భారీ ఎత్తున నిర్వహించేందుకు ఇక్కడికి భారీగా బెట్టింగ్ రాయుళ్లు తరలివస్తున్నారు. ఇందదులో పలువురు రాజకీయ నేతలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోడి పందాల్ని భారీ ఎత్తున నిర్వహిస్తామని స్వయంగా డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ప్రకటించడంతో ఇక్కడ జోష్ మరింత పెరిగింది. దీంతో పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా అవేవీ ఇక్కడ పనిచేయవని తేలిపోతోంది. వచ్చే నాలుగైదు రోజులు ఇక్కడ భారీ ఎత్తున కోడి పందాల నిర్వహణకు రంగం సిద్ధమైంది.

# కూటమికి రాజ్యసభ సీట్లు

(మొదటి పేజి (తరువాయి)

విరమణ చేసి మాజీలు కానున్నారు. ఏపీ నుంచి వైసీపీ సభ్యులుగా ఉన్న అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ సత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్ తో పాటుగా అలాగే టీడీపీ నుంచి సానా సతీశ్ రిటైర్ అవుతున్నారు. ఈ ఏడాది జూన్ 21న ఈ నలుగురు పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు తాజాగా రాజ్యసభ సచివాలయం బులెటిన్ విడుదల చేసింది. కాగా.. టీడీపీ నుంచి రైటర్ అవుతున్న సానా సతీశ్ కు తిరిగి రెన్యువల్ దక్కుతుందా లేదా అనేది సందేహంగా కనిపిస్తోంది. వైసీపీ నుంచి ఖాళీ అయ్యే మూడు స్థానాలు.. అసెంబ్లీలో కూటమికి పూర్తి స్థాయిలో బలం ఉండటంతో వారికే ఈ మూడు స్థానాలు దక్కనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం నుంచి రాజ్యసభ స్థానాల విషయంలో బీజేపీ మెజార్టీ వాటా తీసుకుంటోంది.

# డొంక తిరుగుడు సమాధానాలు

(మొదటి పేజి (తరువాయి)

అన్యాయం చేస్తున్నాడు. సీఎం రేవంత్ అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు చంద్రబాబు సమాధానం చెప్పకుండా డొంక తిరుగుడు సమాధానం ఇస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి' అని వ్యాఖ్యలు చేశారు.వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. 'రాయలసీమకు ద్రోహం చేస్తూ మీడియా సమావేశాల్లో తప్పుడు వ్యాఖ్యలు చేయడమేంటి?. నిజాయితీగా నీటిని అందించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు చంద్రబాబు కృషి చేయాలి. కూటమి నేతలు సవాల్ విసరడం బాగానే ఉంది కానీ పాలకులుగా మీకు బాధ్యత లేదా?. చర్చకు సిద్ధమా అని టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేసిన సవాల్కు మేము సిద్ధమే. రాయలసీమ ప్రాంతవాసులకు నీరు అందించే వరకు మేము పోరాటం కొనసాగిస్తాం' అని హెచ్చరించారు.

# జగన్ ఓ దోపిడీ దొంగ

(మొదటి పేజి (తరువాయి)

అన్నారు. ఎత్తిపోతల పథకం పేరుతో రూ.2,745 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు.అక్రమార్జన కోసం రాయలసీమకు, రాష్ట్ర ప్రజలకు జగన్ తీరని ద్రోహం చేశారని అన్నారు. రాయలసీమపై జగన్‌కు నిజమైన ప్రేమ ఉంటే 18 నెలల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇన్నాళ్లు ఎందుకు గుర్తురాలేదని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు సీఎం చంద్రబాబు పేరును వాడుకుంటున్నాయని, జగన్ తప్పుడు ఆరోపణలతో విషం కక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమరావతిని నిర్మించి తీరుతామని అన్నారు.

# తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

## ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి....హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు సహకరించండి
## మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి.....ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి

న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 10 :

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయన రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌బిఆర్ఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా




కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు..



మాజీ సైనికులను సన్మానించిన గేట్స్ కళాశాల యాజమాన్యం

## గేట్స్ కాలేజీలో మాజీ సైనికులకు సన్మానం

**గుత్తి (తెలుగోడు), జనవరి 10 :**
గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సైన్యంలో సేవలందించి పదవీ విరమణ పొందిన అనంతపురం జిల్లా మాజీ సైనికులను గౌరవిస్తూ ఘనంగా శాలువాలతో సన్మానించారు. ముఖ్యంగా ఇందులో కార్గిల్ యుద్ధంలో పాల్గొని దేశ సార్వభౌమత్వం కోసం పోరాడిన జవాన్లు హాజరుకావడం విశేషం. జవాన్లు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ, దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగభావం, బాధ్యత వంటి విలువల ప్రాముఖ్యతను వివరించారు. "దేశం కోసం జీవించడం ఒక గర్వకారణం" అనే వారి మాటలు విద్యార్థుల హృదయాలను తాకాయనీ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా, లక్ష్యసాధన పట్ల ప్రేరణను కలిగించింది. సైనికుల త్యాగాలు మనకు స్వేచ్ఛాయుత జీవితం అందిస్తున్నాయనే అవగాహన ఈ కార్యక్రమం ద్వారా మరింత బలపడిందనీ కళాశాల కరస్పాండ్ ఒకే పద్మావతమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల శేఖన్న, నాయబ్ సుబేదార్ జింక రామమూర్తి, కృష్ణారావు, కరెస్పాండెంట్ పద్మావతమ్మ, ఎండి రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఏఓ ఇంతియాజ్ బాషా, గేట్స్ ఎన్ ఎస్ ఎస్ విభాగపు విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు

## ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా దంపతులకు ఘన సన్మానం

**గూడూరు (తెలుగోడు), జనవరి 10 :**
ప్రముఖ పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్ రెడ్డి, ఆయన సతీమణి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీమతి పొణకా దేవసేనమ్మని ప్రగతి కుటుంబ సభ్యులు కలసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పొణకా దంపతులు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దేవసేనమ్మ మాట్లాడుతూ ప్రగతి కుటుంబ సభ్యులకు, ప్రజలందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పొణకా దంపతులను సన్మానిస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు

## మన ఇల్లు - మన సంక్రాంతి' సంబరాలు

**గూడూరు (తెలుగోడు), జనవరి 10 :**
మన ఇల్లు మన సంక్రాంతి కొనసాగింపులో భాగంగా గాంధీనగర్ టిడ్కో గృహ సముదాయంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 29 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల సంక్రాంతి ముగ్గులతో సముదాయాన్ని కళకళలాడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏసుపాగు పెంచలయ్య, డివిజన్ ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దీవిపాలెం పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావూరి సురేంద్ర, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేశారు.
ఈ సందర్భంగా ఏసుపాగు పెంచలయ్య మాట్లాడుతూ ముందస్తు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గృహ సముదాయాల్లో లబ్ధిదారులంతా ఐక్యతతో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందించుకోవాలని, అనాగరిక శక్తులను గుర్తించి కట్టడి చేయాలని




సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఏసుపోగు పెంచలయ్య, రేవూరు సురేంద్ర

## జగన్‌వి అసత్య ఆరోపణలు

*మాజీ జెడ్పీ చైర్మన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచల బాబు యాదవ్ ..*

**ఉదయగిరి (తెలుగోడు), జనవరి 10 :**
మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధానిపై అసత్య ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని ఉదయగిరి నియోజకవర్గం సీనియర్ టిడిపి నాయకులు, మాజీ జెడ్పీ చైర్మన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచల బాబు యాదవ్ మండిపడ్డారు. శనివారం నాడు తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఐదు సంవత్సరాలు పని చేసి భారతదేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ ను మార్చారని అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని అని తెలియజేయడం ఆయన రాజకీయ అవగాహన రాహిత్యం ఎంత మాత్రం అర్థమవుతుందని తెలిపారు. రాజకీయాలపై రాష్ట్రంపై



అవగాహన లేనటువంటి అభివృద్ధికి అర్థం తెలియనటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ముందుకు తీసుకొని వెళ్తున్నారని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి ని భారత దేశంలోనే అద్భుతమైన నెంబర్ వన్ రాజధానిగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అమరావతి రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీద ఉన్న అపార నమ్మకంతోనే 35000 వేల ఎకరాలు స్వచ్ఛందంగా రాష్ట్ర రాజధాని కోసం రైతులు త్యాగం చేశారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్ని అసత్య ఆరోపణలు ప్రచారాలు చేసిన ప్రజల నమ్మరని తెలిపారు. మరో మూడు సంవత్సరాలలో కూటమి నాయకత్వంలో అమరావతి రాజధానిగా అభివృద్ధి చెంది పూర్తవుతుందని, ఆంధ్ర రాష్ట్రానికి జీవనాడేనా పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి రాష్ట్రంలో కరువు లేని రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతారని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి వారిలో నారా చంద్రబాబు నాయుడు , మంత్రివర్యులు యువనేత నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి భారీ సంఖ్యలో పరిశ్రమలు రావడం రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో వైసిపి పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని అన్నారు.

# పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు
# ప్రారంభం దిశగా అడుగులు

**అధికారులు,
మెగా ప్రతినిధులతో సమావేశం..
ఎమ్మెల్యే పరిటాల సునీత..**

**ఆత్మకూరు (తెలుగోడు), జనవరి 10 :**
రాప్తాడు నియోజకవర్గంలోని పేరూరు (అప్పర్ పెన్నార్) ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభం దిశగా అడుగులు పడుతున్నాయి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో భూసేకరణ చేసి ఈ పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. పైగా భూమిలిచ్చిన రైతులకు గత ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ పనులు తిరిగి ప్రారంభించే దిశగా అనేక ప్రయత్నాలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని పలు సార్లు కలిసి దీనిపై విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ పనులు ప్రారంభానికి అడుగులు పడుతున్నాయి. తాజాగా ఇందుకు సంబంధించి శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సునీత సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ఎస్ఈ ఇతర అధికారులతోపాటు మెగా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు) వరకు 54 కిలోమీటర్లు కాలువ త్రవ్వకంతో పాటు, 4 లిఫ్ట్ లు, 112 స్ట్రక్చర్లు, సోమరవాండ్ల పల్లి ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఇతర పనుల గురించి చర్చించారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం గురించి చర్చించారు. ఇందులో ప్రస్తుతం రూ. 8.2 కోట్లు రైతులకు చెల్లించేందుకు సిద్ధం చేసినట్టు అధికారులు వివరించారు. బెళుగుప్ప మండలంలో 5 కిలోమీటర్లు కాలువ కోసం, కోనంపల్లి దగ్గర



అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

15 ఎకరాలు కాలువపల్లి దగ్గర 33 ఎకరాలు భూమిని సేకరించాల్సి ఉందన్నారు. 50 స్ట్రక్చర్లు పూర్తి కాగా, 62స్ట్రక్చర్లు నిర్మాణం చేయాల్సి ఉందని వివరించారు. 4పంప్ హౌస్ ల పనులు త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. అలాగే 132/30 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం 8ఎకరాల పొలం సేకరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ నెలలోనే పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభించబోతున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఇది ఆలస్యమైందన్నారు. కనీసం రైతులకు భూసేకరణ డబ్బు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా హామీ ఇచ్చారని అందుకే ఈ పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు చెప్పారు. జవనరి 20 తర్వాత పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

**ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే సునీత**

ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం పలు చోట్ల ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం రామగిరి మండలంలోని వెంకటాపురం క్యాంప్ కార్యాలయం, రామినేపల్లితో పాటు అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను చెప్పుకున్నారు. వారితో ఓపిగ్గా మాట్లాడుతూ అధికారులను అక్కడికక్కడే ఆదేశించి కొన్ని సమస్యలు పరిష్కరించారు. రామినేపల్లి లో అంగన్వాడీ, కమ్యూనిటీ భవనాలు, కందుకూరు జంగాలపల్లి రోడ్డుతో పాటు కొంతమంది వారి గ్రామాల్లో రోడ్లు, భూ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగాల అంశం, పుల్లలరేవు లో దేవస్థానం వద్ద కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిన్నింటిపై సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే వాటిని చేపడతామని హామీ ఇచ్చారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

# 18న ఖమ్మం బహిరంగ సభకు తరలిరండి

**సిపిఐ జీపు జాత..**

**యాడికి (తెలుగోడు), జనవరి 10 :**
18న ఖమ్మంలో జరుగనున్న బహిరంగ సభకు తరలిరావాలని సిపిఐ కోరారు. యాడికి, పెద్దవడుగూరు మండల కేంద్రాల్లో శనివారం సిపిఐ నాయకులు జీపు జాత నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, నారాయణ, అంకన్న, మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు రంగనాయకులు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీసీ. కుల్లాయప్ప, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలోని ఖమ్మంలో జరుగు మహాసభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. శనివారం పెద్దవడుగూరు. యాడికి మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో జీపు జాత




పెద్దవడుగూరులో జీపు జాత నిర్వహించిన సిపిఐ నాయకులు

నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సిపిఐ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 సంవత్సరంలో అడుగు పెట్టబోతోందన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో గొప్ప బహిరంగ సభ ఏర్పాటు చేస్తోంది అన్నారు. సిపిఐ అభిమానులు రైతులు, కూలీలు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హుస్సేన్ పీరా, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఓం నారాయణ, సి. నాగేంద్ర, కిరణ్, దౌల, గఫూర్, మల్లికార్జునయ్య, శేఖర్ రెడ్డి, ఏ. నాగేంద్ర, మాబు, ప్రజా నాట్యమండలి కళాకారులు నాగరాజు నాయక్, వెంకటరాముడు, గిరి, అకులప్ప పాల్గొన్నారు.




యాడికి జీపు జాతలో పాల్గొన్న సిపిఐ నాయకులు

# ఆదోని జిల్లా కోసం పత్తికొండలో రేపటి నుంచి దీక్షలు

**ఆదోని (తెలుగోడు), జనవరి 10 :**
ఆదోని జిల్లా కోసం పత్తికొండలో సోమవారం నుంచి దీక్షలు ప్రారంభించాలని నిర్ణయించారు. శనివారం పత్తికొండ పట్టణంలోని సాయిబాబా ఆలయం ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆదోని జిల్లా సాధన జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో పత్తికొండ పట్టణ, నియోజకవర్గ ప్రముఖులు పాల్గొన్నారు. ఆదోని జిల్లా ఆవశ్యకత గురించి ప్రసంగించారు. ఆదోని జిల్లా సాధన ఉద్యమాన్ని పత్తికొండలో బలంగా తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటు చేసుకొని సోమవారం నుండి దీక్షలు ప్రారంభించాలని జెఏసి తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఆదోని జిల్లా సాధన జేఏసి నాయకులు నూర్ అహ్మద్, సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.రామచంద్రయ్య, మాదాసి,మాదారి కురువ




పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెఏసి నాయకులు

సంఘం కర్నూలు జిల్లా గౌరవ అధ్యక్షులు గురజాల నాగభూషణం, క్రైస్తవ సంఘాల నాయకులు మరియు థమస్ బీసీవై నాయకులు నరేంద్ర యాదవ్, టీచర్ నాయని లక్ష్మన్న, లోక్ సత్తా జయరాముడు, జేఏసీ నాయకులు అయ్యాళప్ప,కోదండ, దస్తగిరి నాయుడు, రాయచూర్ రామకృష్ణ, వీరభద్ర స్వామి సంగాల వెంకటేశు, వర్ల మోహన్, మంకె లక్ష్మణ్ణ తదితరులు పాల్గొన్నారు. పత్తికొండలో ఆదోని జిల్లా సాధన జేఏసి ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా బురుజుల నాగభూషణం ఎన్నికయ్యారు.

# రాయలసీమ ఉద్యమకారునికి ఘన సన్మానం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 10 :**
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జి.ఆర్ ఫంక్షన్ హాల్లో భూమన్ కరుణాకర్ రెడ్డి ప్రచురించిన ఇమాం ప్రస్థానం పుస్తక ఆవిష్కరణ, ఇమామ్ దంపతులకు ఘన సన్మానం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రమణ, జిల్లా అధ్యక్షులు జి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణ,నాయకత్వంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఎం.వి. రమణారెడ్డి, మైసూరా రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన పోతిరెడ్డిపాడు పాదయాత్ర తరహాలో రాయలసీమ మహాసభ అనంతపురంలో నిర్వహించాలని అన్నారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం పేద ప్రజలకు అండగా నిలబడిన ఆర్డిటికి ఎఫ్ సి ఆర్ ఏ ను పునరుద్ధరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై. మధుసూదన్ రెడ్డి, మేయర్ వసీం సలీం,డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, ఎర్రి స్వామి రెడ్డి,వైయస్సార్సీపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి,బుక్కచెర్ల నల్లపురెడ్డి, మాజీ రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, మాజీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, ఆత్మా రామిరెడ్డి, ప్రముఖ రచయితలు బండి నారాయణస్వామి, శాంతి నారాయణ, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు ఉమాపతి,సత్యనారాయణ రెడ్డి,సాంబి రెడ్డి,శాంత మూర్తి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సీఈవో భానూజ, కుల్లాయి స్వామి, ఎస్ టి ఎస్ సి జేఏసీ నాయకులు సాకే హరి, విద్యార్థి నాయకులు చంద్రశేఖర్ యాదవ్, మానవత సలీం మాలిక్, ఆలంబన జనార్ధన,ఇమామ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఇమామ్ దంపతులను సనానిస్తున్న దృశ్యం



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 10 :**
అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జితిన్ శ్రీమతి తేజస్విని కుటుంబ సభ్యులు, అమర్ యాదవ్ కుటుంబ సభ్యుల శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 300 మందికి పైగా అన్నప్రసాదం కార్యక్రమం అందించారు. ఈ కార్యక్రమం ఆలయ పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమంలో నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ శ్రీమతి నిర్మలమురళి తదితరులు పాల్గొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆలయంలో నిర్విరామంగా అన్న ప్రసాద వితరణ జరుగుతోంది.



జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న హాస్టల్ వార్డెన్ సికిందర్ బాష

## వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

*బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ సికిందర్ బాష*

**అగళి (తెలుగోడు), జనవరి 10 ::**
సత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు వడ్డెర్ల సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరుగు వడ్డే ఓబన్న జిల్లాస్థాయి జయంతి ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని అగళి మండల వడ్డెర నాయకులకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్‌కు బిసి బాలుర వసతి గృహం వార్డెన్ సికిందర్ బాష ఆహ్వాన పత్రికలను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి మండలంలోని పెద్ద ఎత్తున వడ్డెర సంఘం నాయకులు,కులబాంధవులు,అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

## ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేని ఎంపీటీసీలు

*మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి ..*

**రోళ్ల (తెలుగోడు), జనవరి 10 :**
మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి రెండు రోజులు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరై కోరం లేక సమావేశం వాయిదా వేయడం అత్యంత దురదృష్టకరమని మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి దుయ్యబడ్డారు. మండలంలో 11 మంది వైసీపీ ఎంపీటీసీలు ఉన్నప్పటికీ, మండల ప్రజల సమస్యల పరిష్కారం మీద సమావేశంలో చర్చించే అవకాశన్ని దుర్వినియోగం చేయడం ద్వారా తమకు ఓటు వేసి గెలిపించిన ఓటరు దేవుళ్లను



అవమానపరిచినట్టేనని తెలియజేశారు. ప్రోటోకాల్ ప్రకారం మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ అయిన నేను, రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ,సింగిల్ విండో అధ్యక్షులు, దాసరెడ్డి, ఏపీఐఐసి డైరెక్టర్ రామకృష్ణ, మండల స్థాయి అధికారులు, రెండు రోజులు సమావేశానికి హాజరై దాదాపు రెండు గంటల పాటు సమావేశ మందిరంలోనే ఉన్నా కూడా, వైసీపీ కీ చెందిన 11 మంది ఎంపీటీసీలు హాజరుకాక పోవడంతో సమావేశాన్ని వాయిదా వేయడం క్షమించ రానిదన్నారు. వైసీపీ ఎంపీటీసీల ప్రజావ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.



బిజెపి ఓబీసీ యువమోర్చా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న గురప్ప

## బత్తలపల్లి బిజెపి ఓబీసీ యువ మోర్చా అధ్యక్షుడిగా కుమ్మర గుర్రప్ప

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 10 :**
బత్తలపల్లి మండల బిజెపి ఓబీసీ యువమోర్చా అధ్యక్షుడిగా జ్వాలాలపురానికి చెందిన కుమ్మర గుర్రప్ప నియమకులయ్యారు. శనివారం ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు గుడ్డుమర్రి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులు అనిల్, నియామక పత్రాన్ని అందజేశారు. తన నియమానికి సహకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్, హరీష్ బాబులకు గుర్రప్ప కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన ఈశ్వరయ్య

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 10 :**
అనంతపురం, కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రమైన బత్తలపల్లి బైపాస్లోని వై జంక్షన్ వద్ద ఈ నెల 2వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాకే ఈశ్వరయ్య(45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం అనంతపురం నుంచి కదిరి వెలుతున్న ఐచర్ వాహనం, అనంతసాగరం నుంచి బత్తలపల్లికి వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అనంతసాగరం గ్రామానికి చెందిన సాకే ఈశ్వరయ్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్థం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈశ్వరయ్యకు భార్య మారుతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



బదిలీపై వెళుతున్న ఎస్సై ఇషాక్‌బాషాకి సన్మానం చేస్తున్న దృశ్యం

## బదిలీపై వెళ్తున్న ఎస్సై ఇషాక్ బాషాకి సన్మానం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 10 :**
అమరాపురం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళు_న్న ఎస్సై ఇషాక్ బాషాకు అంబేద్కర్ స్మృతి వనం సభ్యులు శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ స్మృతివనం అధ్యక్షుడు ఉదుగూరు శివకుమార్, గౌరవ అధ్యక్షులు నారాయణప్ప, జయకుమార్, సీనియర్ నాయకులు పేలుబండ ప్రసాద్, ఉదుగూరు తిప్పేస్వామి, చిట్టనడుకు మహాలింగప్ప,చెన్నప్ప, సురేష్, రామచంద్రప్ప, రఘు, దేవరాజు, ఓంకార్ ,నాగరాజు, చంద్ర, హనుమంతరాయ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్మృతి వనంనాయకులు నారాయణప్ప, శివకుమార్, జయకుమార్ లు మాట్లాడుతూ మండలంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రజల మన్ననలను పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్మృతి వనం భవిష్యత్తులో చ్మరింత అభివృద్ధి చెందాలని బదిలీపై వెళుతున్న ఎస్ఐ ఆకాంక్షించారు.

## వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలకు రామక్రిష్ణకు ఆహ్వానం

**రొళ్ల (తెలుగోడు), జనవరి 10 :**
పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న భారతదేశ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలకు మండలం నుంచి ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణకు ఆహ్వానం అందింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున జరిగే ఈకార్యక్రమానికి హాజరు కావాలని శనివారం బిసి వెల్ఫేర్ వార్డెన్ సికిందర్ బాషా ఆహ్వాన పత్రిక ను అందించారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, బూత్ ఇంచార్జ్ నాగరాజు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న వార్డెన్ సికిందర్ బాషా

# ముదిగుబ్బలో రహదారి భద్రతకు పెద్దపీట

### అవగాహన ర్యాలీ, మానవహారం.. పాఠశాల వాహనాలపై ప్రత్యేక దృష్టి.. మోటారు వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ ..



రోడ్డు భద్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు అధికారులు

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 10 :**
జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ముదిగుబ్బ పట్టణంలో శనివారం రవాణా శాఖ, స్థానిక పోలీస్ శాఖ సంయుక్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం కలిగించాయి. కదిరి మోటార్ వాహన తనిఖీ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో హైస్కూల్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఆటోలు, మ్యాజిక్ వాహనాలు, ఇతర రవాణా వాహన డ్రైవర్లు, యజమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు రోడ్డు భద్రతా నినాదాలు చేస్తూ ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ ప్రాంతంలో మానవహారం



రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్న మోటారు వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్

ఏర్పాటుచేసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మోటారు వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. రాత్రివేళల్లో అధిక వేగం, నిర్లక్ష్యం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని జాగ్రత్తలు అవసరమని సూచించారు.

పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లు అత్యంత నైపుణ్యంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థుల భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. "రహదారి భద్రత మన అందరి బాధ్యత" అనే భావన ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిదేనని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన మొదటి గంట అయిన 'గోల్డెన్ అవర్లో వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ విషయంలో సహకరించిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని వివరించారు. ట్రాఫిక్ నియమాల ఖచ్చితంగా పాటించడం ద్వారానే సురక్షిత ప్రయాణం సాధ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై నాగభూషణం, హెడ్ కానిస్టేబుల్ సౌఖత్ వలి సహా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సప్తమ శ్రీవారి తిరుమల మహాపాదయాత్ర ఘన విజయం

### వేడుకగా విజయోత్సవ సభ..

**ముదిగుబ్బ, ధర్మవరం (తెలుగోడు), జనవరి 10 :**
ధర్మవరం పట్టణంలోని శనినారాయణ స్వామి దేవాలయంలో సప్తమ శ్రీవారి తిరుమల మహాపాదయాత్రకు సంబంధించిన దిగ్విజయ విజయ సభను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గోవిందమాల ధారణ సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తులతో ఆలయ ప్రాంగణాన్ని భక్తి రసమయంగా మార్చింది. ఈ సందర్భంగా గోవిందమాల ధారణ సేవా కమిటీ గురుస్వామి దేవత కృష్ణమూర్తి మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 20 నుంచి 28 వరకు ధర్మవరం నుంచి తిరుమల వరకు 110 మంది భక్తులు కాలినడకన పాదయాత్ర నిర్వహించారని తెలిపారు. శ్రీవారి దర్శనంతో పాదయాత్ర విజయవంతంగా పూర్తిచేసిన భక్తులను శనివారం శనినారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా సత్కరించి వారి భక్తిని స్మరించుకున్నామని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో పాల్గొనడం తమ జీవితంలో చిరస్మరణీయ అనుభూతిగా మారిందని, ఇలాంటి మహత్తర సేవలో భాగస్వాములైనందుకు ఎంతో ఆనందంగా ఉందని దేవత కృష్ణమూర్తి తెలిపారు. భక్తుల అచంచల విశ్వాసం, క్రమశిక్షణే ఈ మహాపాదయాత్ర విజయానికి మూలకారణమన్నారు. అంతకుముందు



పాదయాత్రికులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

ఆలయంలో ప్రత్యేక పూజలు, వెంకటేశ్వర స్వామి నామస్మరణ, భజనలు నిర్వహించగా ఆలయ పరిసరాలు 'గోవిందా.. గోవిందా' నామస్మరణతో మార్మోగాయి. భక్తుల శ్రద్ధ, సమర్పణ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై పాదయాత్రికులను ఆశీర్వదించారు.

# బ్యాంకు సేవలపై అవగాహన కలిగిఉండాలి

### ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీదేవమ్మ..

**తనకల్లు (తెలుగోడు), జనవరి 10 :**
తనకల్లు మండల పరిధిలోని కొర్తి కోట గ్రామంలో ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అండ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదర్శ



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పాల్గొన్న రైతులు, ఖాతాదారులు

రూరల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అండ్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీ దేవి, శివానంద పాల్గొన్నారు. బ్యాంకు సేవల ఉపయోగాలు, బీమా, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకులలో ఉన్న అన్ని సంక్షేమ పథకాలు అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫైనాన్స్ కంపెనీల వైపు ఎవరు వెళ్లకూడదన్నారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఖాతాదారుడు కచ్చితంగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలియజేశారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930 కి కాల్ చేయాలని అన్నారు.

# లక్ష్మి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**రొళ్ల (తెలుగోడు), జనవరి 10 :**
మండల కేంద్రములోని శ్రీ లక్ష్మీ విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. పంచభూతాలను పూజించారు. సకల దేవతలకు నిలయమైన గోవును పూజించారు. చిన్నారులకు భోగి పళ్ళు పోశారు.



గోవును పూజిస్తున్న దృశ్యం



భోగి మంటలు వేసి నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. బోగీ మంటలు వెలిగించి దాని చుట్టూ తిరుగుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్రాంతి, సంస్కృతి సంప్రదాయాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ శ్రీధర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు. సంక్రాంతి సంబరాలు తోరణంతో కరెస్పాండంట్ శ్రీధర్



పోలీసు చట్టాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శోభారాణి

## పోలీసు చట్టాలపై ప్రజలకు అవగాహన

ఎస్సై శోభారాణి.

**అగళి (తెలుగోడు), జనవరి 10 :**
జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని నరసంబూది గ్రామంలో శనివారం ఎస్సై శోభారాణి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని అసాంఘిక కార్యక్రమాలపై పలు సూచనలు సూచనలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా బెల్ట్ షాపులు గుట్కా, మట్కా నిర్వహిస్తారన్నటువంటి అనుమానితులైన ఇండ్లను కూడా తనిఖీ చేయించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఫోక్సో కేసు మహిళలు చిన్నారులు వృద్ధుల రక్షణ సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాలు దొంగతనాలు ఇసుక అక్రమ రవాణా శాంతి భద్రతల వంటి తదితర అంశాలను కూడా వివరించారు. పేకాట వంటి స్థావరాలను నిర్వహించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్సై శోభారాణి వెంట ఏఎస్ఐ లు బషీర్, శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ చంద్ర మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది నాగరాజు, రాజన్న,శివకుమార్, మహిళా కానిస్టేబుల్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు



బత్తలపల్లిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కూటమినేతలు, అధికారులు

## బత్తలపల్లిలో స్వచ్ఛక్రాంతి కార్యక్రమం

### పారిశుధ్య కార్మికులకు సన్మానం

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 10 :**
బత్తలపల్లి, మాల్యవంతం పంచాయతీ కేంద్రాల్లో శనివారం స్వచ్ఛక్రాంతి కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను మండల అధికారులు కూటమి నేతలు కొనియాడారు. అపరశుభ్రతను తొలగించి, గ్రామాల పరిశుభ్రతకు తోడ్పడుతున్న కార్మికులను పూలమాలలు, శాలవాలతో ఘనంగా సన్మానించారు. మాల్యవంతం పంచాయతీలో టిడిపి కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో క్రిష్టప్ప, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్, తదితరులు కార్మికులను సన్మానించగా మండల కేంద్రమైన బత్తలపల్లి లో క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, ముత్యాల నాయుడు తదితరులు కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు చేస్తున్న ఎస్సీ జన సంఘం నేతలు

## ఎస్సీ జనసంఘం మండల కమిటీ ఏర్పాటు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 10 :**
ఎస్సీ జన సంఘం నూతన మండల కమిటీని నియమించినట్లు జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దాసగానిపల్లి కుల్లాయప్ప, ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లిలో ఎస్సీ జన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ జన సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎస్సీ జన సంఘం మండల అధ్యక్షులుగా సాకే ఓంనాథ్, మండల ప్రధాన కార్యదర్శిగా కొండపాక ఓబులయ్య, మండల స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులుగా గుమ్మలగుంట రామాంజిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నూతన కమిటీ ఎంపికకు ఎస్సీ జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ దాసగానిపల్లి కుల్లాయప్ప, రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్, ఆంధ్ర, కర్ణాటక స్టేట్ ఇంచార్జ్ సాకే కుల్లాయప్ప, రాష్ట్ర కార్యదర్శి నిడిగల్లు ధను, ఎస్సీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు విజయవంతం చేయండి

వడ్డెర సంఘం నాయకుడు భీమ్ రాజు ..

**గుడిబండ (తెలుగోడు), జనవరి 10 :**
గుడిబండలో ఆదివారం వడ్డెర్ల సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరుగు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని వడ్డెర సంఘం నాయకుడు భీమరాజు మంజునాథ, వెంకటేష్, శ్రీనివాసులు హనుమంతు తెలిపారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ గుడిబండలో వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించడం



వడ్డే ఓబన్న

జరుగుతుందని ఈ కార్యక్రమానికి మండలంలోని పెద్ద ఎత్తున వడ్డెర సంఘం నాయకులు, కులబంధావుల,అభిమానులు హాజరై విజయవంతం చేయాలనీ వారు కోరారు.



వడ్డెర సంఘం నాయకుడు భీమ్ రాజు



భరతనాట్య కళాకారిణి తేజస్వినికి సన్మానం చేస్తున్న దృశ్యం

# భరతనాట్య కళాకారిణి తేజస్వినికి సన్మానం

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 10 :**
రాయలసీమ సంగీత, నృత్య కళోత్సవంలో భాగంగా ప్రొద్దుటూరు నటరాజ కళాక్షేత్రంలో శనివారం నృత్య కళాకారులకు ఘన సన్మానం చేశారు. ఇందులో భాగంగా ముద్దనూరు, జమ్మలమడుగు, పాఠశాలలో విద్యార్థులకు భరతనాట్యాన్ని బోధిస్తున్న కళాకారిణి తేజస్వినిని ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు కళాకారులు మాట్లాడుతూ అంతరించిపోతున్న మన సంస్కృతి సాంప్రదాయాలు, జాతీయ నృత్యం అయినా భరతనాట్యం, సాంప్రదాయ కలలు అంతరించిపోకుండా ప్రతి ఒక్కరూ కాపాడుకొని మరికొందరిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.



# వడ్డే ఓబన్న జయంతి వేడుకలు విజయవంతం చేయండి

*సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి..*
*మండల పార్టీ అధ్యక్షులు ఈరన్న..*
*ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ..*

**రోళ్ల (తెలుగోడు), జనవరి 10 :**





మండలకేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు రేనాటి వీరుడు మొదటి తరం స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219 వ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ , ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు నిర్వహించే ఈకార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## రెండు బంగారు గొలుసులు, ఇన్నోవా వాహనం స్వాధీనం.. రూరల్ సీఐ నాగభూషణం ..

**ప్రొద్దుటూరు (తెలుగోడు), జనవరి 10 :**
ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు మంగళసూత్ర చైన్ దొంగతనానికి సంబంధించిన కేసును ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. శనివారం రూరల్ సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం ఈ కేసును అత్యంత చాలెంజ్‌గా తీసుకొని, త్వరితగతిన ఛేదించాలని జిల్లా పోలీస్ అధికారి నచ్చికేతన్ విశ్వనాధ్, ప్రొద్దుటూరు డి.ఎస్.పి పి. భావన ఆదేశాలు జారీ చేయడంతో, డి.ఎస్.పి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యం. నాగభూషణ్ ఆధ్వర్యంలో, ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐలు బి. అరుణ్ రెడ్డి, కె.సి. రాజు సిబ్బందిని పలు బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో 10 వ తేదీన, ఉదయం, యర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని నంగనూరు పల్లె క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు ప్రొద్దుటూరులో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు చైన్, నందలూరు బస్టాండ్ వద్ద ఆర్ టి సి బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు చైన్ దొంగతనం చేసినట్లు స్వచ్ఛందంగా ఒప్పుకున్నట్లు తెలిపారు. తమిళనాడు కు చెందిన నాగమణి అలియాస్ నాగమ్మ, వెంకటరమణ, రేఖ, రాచనేని అర్జున్, అలాగే ఇద్దరు ముద్దాయిలు పరారీలో ఉన్నారని సి ఐ నాగభూషణం తెలిపారు.

నాగమణి అలియాస్ నాగమ్మ బ్యాగ్ లిఫ్టింగ్ తో పాటు మహిళల మెడలోని చైన్ కటింగ్‌లో నిపుణురాలని, ఇప్పటివరకు ఆమెపై తమిళనాడులో పలు దొంగతనాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వెంకటరమణ రేఖ అనే మహిళపై బాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఒక దొంగతనం కేసు పెండింగ్ లో ఉందని వివరించారు. రాచనేని అర్జున్ నేరానికి ఉపయోగించిన ఇన్నోవా వాహనం డ్రైవరనీ ,ఇతనిపై బెంగళూరు సిటీ లోని అట్టిబెల్లె పోలీస్ స్టేషన్ నందు ఒక కేసు పెండింగ్ లో ఉందని తెలిపారు. ముద్దాయుల వద్ద నుండి రెండు బంగారు చైన్లు (సుమారు 53 గ్రాములు), చైన్ కటింగ్‌కు ఉపయోగించిన స్టీల్ కత్తెర, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, స్వాధీనం చేసిన బంగారు చైన్లు సంబంధిత కేసులకు చెందిన దొంగసొత్తుగా గుర్తించబడ్డాయనీ సి ఐ నాగభూషణం తెలిపారు.

ఫిర్యాదిదారు కోట్లూరు పర్వతమ్మ గత నెల 28 తేదీన ఉదయం సుమారు 10.00 గంటలకు తన నివాసం నుండి బయలుదేరి బొల్లవరం వెళ్లి, సాయంత్రం సుమారు 5.00 గంటల సమయంలో బొల్లవరం నుండి ప్రొద్దుటూరు పట్టణంలోని రాజీవ్ సర్కిల్ చేరుకుని, అక్కడ నుండి అమృతా నగర్ వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ప్రయాణ సమయంలో ఆటోలో ముందుగా ఉన్న వ్యక్తులు తరువాత ఎక్కి దువ్వూరు సర్కిల్ సమీపంలో దిగిన నలుగురు మహిళల గుంపు గందరగోళాన్ని ఉపయోగించుకొని, తెలియని దొంగలు ఫిర్యాదిదారి మెడలో ఉన్న సుమారు 30 గ్రాముల బరువు గల బంగారు మంగళసూత్ర గొలుసును దొంగిలించారు. పధకం ప్రకారం ఆటో వెనుక అనుసరిస్తున్న వారి ఇన్నోవా వాహనంలో పారిపోయారని, బాధితురాలి



నిందితుల వివరాలు వివరిస్తున్న సిఐ నాగభూషణం

ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో బి ఎన్ ఎస్ గా కేసు నమోదు అయ్యిందని ఆయన తెలిపారు.

అదే విధంగా గత నెల 29 వ తేదీన ఉదయం సుమారు 11.00 గంటలకు ఫిర్యాదిదారు వల్లూరు భాగ్యమ్మ నందలూరు బస్టాండు వద్ద ఉన్న సమయంలో కడపకు వెళ్లే బస్సు వచ్చింది. బస్సు వచ్చిన వెంటనే అక్కడ ఉన్న మహిళలు గుంపుగా తోసుకుంటూ బస్సు ఎక్కుతుండగా, ఆ గుంపులో ఎవరో ఫిర్యాదిదారిని తోసుకుంటూ గందరగోళం సృష్టించారు. అదే సమయంలో గుర్తుతెలియని మరో వ్యక్తి ఫిర్యాదిదారి మెడలో ఉన్న చైన్‌కు కట్టిన తాడును కత్తెరతో కత్తిరించి చైన్‌ను దొంగిలించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం బస్సు బస్టాండు ప్రాంతం దాటిన తరువాత నలుగురు వ్యక్తులు బస్సు నుండి దిగి, అలాగే, పధకం ప్రకారం వెంటనే వెనుకగా వచ్చిన ఇన్నోవా కారులో ఎక్కి అక్కడి నుండి పారిపోయారన్నారు. ఫిర్యాదు మేరకు నందలూరు పోలీస్ స్టేషన్ బి ఎన్ ఎస్ గా కేసు నమోదు అయింది.

ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్, నందలూరు పోలీస్ స్టేషన్ బిఎన్ఎస్ కేసులకు సంబంధించి ముద్దాయులను అరెస్ట్ చేసి దొంగసొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.

ముద్దాయులు రద్దీగా ఉండే బస్సులు, ఆటోలు, బస్టాండ్లను లక్ష్యంగా చేసుకొని, మహిళల మెడలోని బంగారు చైన్లను కత్తిరించి, ముందుగా అనుసరిస్తున్న కారులో పారిపోయే విధంగా వ్యవస్థాపకంగా నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడి కావడంతో వీరికి పూర్వ నేర చరిత్ర కూడా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని సిఐ నాగభూషణం తెలిపారు. ముద్దాయి లను ప్రొద్దుటూర్ కోర్టు ముందు హాజరుపరుచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిఐ నాగభూషణం తెలిపారు.

రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని మహిళలపై జరుగుతున్న దొంగతనాల కేసులను జిల్లా పోలీస్ శాఖ అత్యంత సీరియస్‌గా తీసుకుంటోంది. ఇటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ఈ కేసును ఛేదించిన ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యం. నాగభూషణ్, యస్.ఐ లు బి. అరుణ్ రెడ్డి, కే.సి.రాజు, పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దేవ దాసు, కానిస్టేబుల్స్ కె.రఘు రామి రెడ్డి, కె. సుధాకర్ రెడ్డి, జె. సునీల్, ఎస్.చిన్న నాగన్న లను జిల్లా ఎస్పీ, ప్రొద్దటూరు డీఎస్పీ లు అభినందించారు.



సిమెంట్ రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

*బోరెడ్డి వెంకట రమణారెడ్డి..*

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 10 :**
గ్రామాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని దువ్వూరు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బోరెడ్డి వెంకట రమణారెడ్డి, టిడిపి నాయకులు మిల్లు శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం దువ్వూరు మండలం ఇడమడక గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 45 లక్షల నిధులతో, ఇడమడక సచివాలయం నుండి కడప-కర్నూలు నేషనల్ హైవే వరకు నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు వారు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2010లో నేషనల్ హైవే రోడ్డు వచ్చినప్పటి నుండి ఇడమడక గ్రామ శివారులో సరైన కట్ పాయింట్ లేక ఇడమడక, బయనపల్లె, నారాయణపల్లె, కృష్ణం పల్లి, చిన్న మంగలి, పెద్ద వంగలి గ్రామాలకు చెందిన ప్రజలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు . ఇప్పుడు నిర్మిస్తున్న ఈ రోడ్డు ద్వారా ఆయా గ్రామాల ప్రజల ప్రయాణం సురక్షితం అవుతుందని, తెలిపారు. ఈ రహదారి మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇడమడక సర్పంచ్ చింతలపూరి నరసమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ ముద్దం వెంకటేశ్వర్లు, నాయకులు ముద్దం రమణయ్య, జనసేన నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో జె.సుబ్బారెడ్డి, ఏపీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, కార్యదర్శి మహేంద్ర రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుభాష్, వీఆర్వో హరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోండి

*నగలు జాగ్రత్త.. పోలీసుల సూచన..*



**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 10 :**
సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని, అలాగే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడకుండా పండుగ జరుపుకోవాలని సీఐ నాగేష్ బాబు. ఎస్సై మొయిద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కోడిపందేలు, పేకాట, తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన పరోక్షంగా వాటిని ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. మరికొందరు పండుగ రోజులలో ఇతర ప్రాంతాలకు వెళుతూ ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం అని అన్నారు. అలా అవకాశం లేని పక్షంలో ఊర్లకు వెళ్తున్నప్పుడు పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్ప తెలియపరచకుండాద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదని ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ చేయాలి అన్నారు. ఏదైనా ఊరు వెళుతున్నప్పుడు. సంబంధిత పోలీస్ స్టేషన్‌కు 100/112 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ నియమాలు పాటించడం వల్ల ఆస్తులు కాపాడుకోవచ్చునని తెలిపారు.

# దువ్వూరు పిహెచ్‌సీలో సురక్షిత మాతృత్వ అభియాన్

## వైద్యాధికారి డాక్టర్ హెచ్. సురేష్ బాబు..

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 10 :**
గర్భిణీల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాను కార్యక్రమం శనివారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించబడింది. వైద్యాధికారి డాక్టర్ హెచ్. సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్ ఎస్. రోషిణి గర్భిణీలకు వైద్య సేవలు అందించారు. దువ్వూరు మండల పరిధిలోని వివిధ గ్రామ సచివాలయాల నుండి మొత్తం 43 మంది గర్భిణీలు ఈ శిబిరానికి హాజరయ్యారు. ల్యాబ్ టెక్నీషియన్ బయన్న పర్యవేక్షణలో గర్భిణీలకు రక్త పరీక్షలు, యూరిన్, ఆల్బుమిన్, షుగర్, హెచ్‌బి గ్రూపింగ్ వంటి పరీక్షలతో పాటు ఎత్తు, బరువును తనిఖీ చేశారు. వీరిలో అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన (హైరిస్క్) 24 మంది గర్భిణీలకు ఉచితంగా స్కానింగ్ నిర్వహించి, ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ, గర్భిణీలు రక్తహీనతకు గురికాకుండా అంగన్వాడీల ద్వారా అందించే చిక్కీలు, పాలు, కోడిగుడ్లు మరియు రాగి జావ వంటి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని కోరారు. ప్రభుత్వం గర్భిణీ స్త్రీల కోసం ప్రవేశపెట్టిన జనని సురక్ష, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన , జనని శిశు సురక్ష



గర్భిణీలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

యోజన వంటి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. సురక్షితమైన ప్రసవం కోసం ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రినే ఆశ్రయించాలని, ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణీలు నిరంతరం డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్, శాంతకుమారి, శివగంగరాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# భూమిపై సంపూర్ణ హక్కులు యజమానికే

*ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్..*

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 10 :**
రైతుల భూమిపై సర్వ హక్కులు భూమి యజమానికే చెందుతాయని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ హక్కుల పత్రాల స్థానంలో రాజముద్రతో నూతనంగా రూపొందించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ భూమిపై ఉన్న సర్వ హక్కులు భూమి యజమానికే చెందుతాయని, రైతుల భూ హక్కులను భద్రపరిచే ఉద్దేశంతోనే ఈ నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని అన్నారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రైతులకు భద్రత, నమ్మకం కల్పించడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



# సీమద్రోహాన్ని నిలదీయండి

## పదవులకు రాజీనామా చేయండి.. ఆర్ఎస్‌పి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి..

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 10 :**
రాయలసీమ ప్రయోజనాలను పక్కన పెట్టి, కూటమి ప్రభుత్వం సీమ ద్రోహానికి పాల్పడుతోందని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం దువ్వూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరిపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయం వేడెక్కింది. "చంద్రబాబుతో ఏకాంతంగా చర్చలు జరిపి రాయలసీమ లిఫ్ట్ పనులు ఆపివేయించాను" అని రేవంత్ రెడ్డి చెప్పిన ప్రకటనపై చంద్రబాబు ఎందుకు నోరు విప్పడం లేదని కుంచం ప్రశ్నించారు. ఇది రాయలసీమ సమాజానికి జరిగిన తీరని అవమానమని, ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య జరిగిన ఆ 'చీకటి ఒప్పందం' ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ ఆత్మగౌరవాన్ని చాటుకోవాలని ఆయన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

పిలుపునిచ్చారు. "చంద్రబాబు కబంధ హస్తాల నుండి బయటకు రండి. ఓట్లు వేసిన ప్రజల పక్షాన నిలబడండి అన్నారు. సీమ ప్రాజెక్టుల కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం అవసరమైతే పదవులకు రాజీనామా చేసి పోరాడాలని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి అంతా కోస్తా, ఉత్తరాంధ్రకే తరలిస్తూ రాయలసీమను ఎడారిగా మారుస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేసే కుట్రను రాయలసీమ సమాజం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించదని, దీనిపై తాడోపేడో తేల్చుకుంటామని డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండవ రోజు మండల సర్వసభ్య సమావేశం వాయిదా

**రోళ్ల, (తెలుగోడు)జనవరి 10 :**
స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో రెండవ రోజు శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి సైతం ఎంపీటీసీ లు గైర్హాజరైయ్యారు. సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో పాటు ప్రభుత్వం నుంచి నామినేటెడ్ అయినా ప్రతినిధులు హాజరైనారు. కాని 11 మంది ఎంపీటీసీ ల్లో ఒక్కరూ కూడా సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడంతో మళ్లీ వాయిదా వేసారు.



సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

# సై అంటే.. సై ...

## పండుగ మాటున నేతల పోటీ.. క్రికెట్ మైదానంలో రాజకీయాలు.. యువతే లక్ష్యంగా వ్యూహాలు వర్గపోరుకు వేదికగా మారిన క్రీడలు.. గ్రామాల్లో రాజకీయ వేడి..


*సంక్రాంతి పండుగ పేరుతో గ్రామాల్లో ఒక పక్క భోగి మంటలు ఎగసిపడుతుంటే, మరోపక్క రాజకీయ సెగలు కూడా అదే స్థాయిలో రాజుకుంటున్నాయి. పండుగ వేడుకల మాటున నాయకుల మధ్య ఆధిపత్య పోరు బహిరంగ క్రీడా మైదానాలకు మారింది. క్రికెట్ బ్యాట్ చేతిలో పెట్టి యువతను తమ వైపు తిప్పుకునే రాజకీయ ఆటలు ఊపందుకున్నాయి. కనుమ పండుగ వేళ పోట్ల గిత్తల పోట్లాటను తలపించేలా నేతల మధ్య పోటాపోటీ టోర్నమెంట్లు సాగుతున్నాయి. గ్రామ గ్రామాన మైదానాలు రాజకీయ శక్తి ప్రదర్శన వేదికలుగా మారాయి. లక్షల రూపాయల ఖర్చుతో నిర్వహిస్తున్న క్రీడలు ఎన్నికల ముందస్తు ప్రచారానికి ఆయుధంగా మారుతున్నాయి. ఒకే పార్టీలోని వర్గాలు వేర్వేరు జట్లుగా విడిపోయి పోటీలు నిర్వహించడం ఆసక్తికరంగా మారింది. యువత ఉత్సాహాన్ని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో నేతలు క్రికెట్‌ను రాజకీయ అస్త్రంగా మలుస్తున్నారు. పండుగ సంబరాల్లో కలిసిపోయిన ఈ రాజకీయ క్రీడలు గ్రామాల్లో కొత్త చర్చలకు తెరలేపుతున్నాయి. ఇలా సంక్రాంతి పండుగ అట్లూరు మండలంలో రాజకీయ వేడిని మరింత పెంచుతోంది.*

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 10 :**
అట్లూరు మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎప్పుడూ లేని విధంగా క్రీడా పోటీలు నిర్వహించడానికి నాయకులు ముమ్మర ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రధానంగా యువతను ఎక్కువ ఆకర్షించే క్రికెట్ టోర్నమెంట్లపై దృష్టి సారించారు. బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలంలోసంక్రాంతి పండుగ సందర్భంగా ఎన్నడు లేని విధంగా క్రీడా పోటీలు నిర్వహించడానికి నాయకులు మండల కేంద్రాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ క్రీడా పోటీలను నేడు ఆదివారం ప్రారంభించనున్నారు. మండల స్థాయి, ఆయా గ్రామాల స్థాయిలో పోటీల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఒక్కో టోర్నమెంట్లో 6 లక్షలు నుంచి10 లక్షల రూపాయల పైబడి ఖర్చు చేస్తున్నారు. ఐదారు నెలల లోపే స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున తమ ఉనికిని తిరిగి గ్రామాల్లో చాటుకోవడానికి ఈ సంక్రాంతి పండుగను వేదికగా చేసుకుని పల్లె ప్రాంతాల్లో రాజకీయ పట్టున్న యువతను తమ వైపు తిప్పుకోవడానికి సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగానే బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు మండలం లో ప్రధాన రాజకీయ అధికార తెలుగుదేశం పార్టీ లో నీ ఒకే పార్టీలో ఆధిపత్య పోరులో




నువ్వానేనా అన్న రీతిలో వర్గపోరు సాగిస్తున్న నాయకులు ఈ పోటీల్లో వేరువేరు టోర్నమెంట్లలలో పాల్గొంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా రాజకీయ క్రీడలు జోరందుకోవడం ప్రస్తుతం హాటాపిక్గా నిలుస్తున్నాయి. ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, ప్రస్తుత తెలుగుదేశం పార్టీ నియోజకవర్గఇంచార్జ్ రితీష్ రెడ్డి నాయకులు ఈ క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. అట్లూరు మండలం బద్వేల్- కడప ప్రధాన రహదారి ఎస్ వెంకటాపురం,గంగానగరం సమీపంలోని మైదానం లో జరిగే పోటీల నిర్వహణకు సుమారు రూ .3.5 లక్షల రూపాయలు యువతకు అందజేసి అట్టహాసంగా ఈ పోటీలను బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ రితిష్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఆయన అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు అట్లూరు మండల చుట్టుపక్కల గ్రామాల యువకులు నియోజకవర్గంలోని ప్రధాన నాయకులు పాల్గొనున్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీలోనే ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో, అట్లూరు మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్ ఎల్లమ్మ గుడి సమీపం మైదానంలో జరిగే పోటీల నిర్వహణకు సుమారు రూ .6 లక్షల రూపాయలు యువతకు అందజేసి పోటీలను ప్రారంభించనున్నారు. భారీ ఎత్తున క్రికెట్ పోటీలను నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు .ఆదివారం మండల స్థాయిలో ఒకే వర్గంలో రెండు వేరు వేరు టోర్నమెంట్లను ప్రారంభించనున్నారు. మండలంలోని గ్రామీణ యువతకు ప్రత్యేకంగా క్రికెట్ కిట్లు ఏర్పాటు చేసి ఈ పోటీలకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా మండలం లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ ఎత్తున క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా ఒక్కసారిగా గ్రామ గ్రామాన రాజకీయ క్రీడలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది.

# 12న వస్తోన్న శంకరవరప్రసాద్ గారు



'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

# రాజాసాబ్ 112కోట్ల వసూళ్లు




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.

# నేను డాక్టర్‌ని, సిస్టర్‌ని కాను... శ్రీలీల ఫన్నీ రిప్లై

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరాశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



# అమితాబ్‌కూ తప్పని అభిమానుల తాకిడి



ఇటీవల ఫ్యాన్స్ అత్యుత్సాహంతో సెలబ్రిటీలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిధి అగర్వాల్, సమంత, విజయ్, తనూజ ఇలా పలువురు ఫ్యాన్స్ వలన చాలా ఇబ్బందికి గురయ్యారు. ఇక ఇప్పుడు ఇదే జాబితాలో అమితాబ్ బచ్చన్ కూడా చేరారు. సూరత్ ఎయిర్ పోర్ట్‌లో ఆయనని చూసేందుకు భారీ ఎత్తున ఫ్యాన్స్ తరలి రాగా, ఆయన తన కారు వద్దకు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. అభిమానుల తాకిడి ఒకేసారి ఎక్కువ కావడంతో విమానాశ్రయం ద్వారం వద్ద ఉన్న గ్లాస్ పగిలిపోయింది. ఆ సమయంలో అమితాబ్ కాస్త దూరంగా ఉండడంతో ప్రమాదం నుండి బయటపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే ముంబైలోని తన నివాసం 'జల్సా' వద్ద ప్రతి ఆదివారం అభిమానులను పలకరించడం అమితాబ్ బచ్చన్‌కు ఎన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక సంప్రదాయంలా మారింది. అయితే ఇటీవల తన ఇంటి వద్ద కనిపించిన అభిమానుల భారీ సంఖ్య, వారి ఉత్సాహం, నిరంతర నినాదాలు బిగ్ బీని భావోద్వేగానికి గురి చేశాయి. జల్సా బయట చేరిన జనసంద్రం తన కోసం కేరింతలు కొడుతుంటే, ఆ ప్రేమను చూసి తాను ఆశ్చర్యపోయినట్టు అమితాబ్ బచ్చన్ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి దృశ్యాలను వీడియోల రూపంలో తన బ్లాగ్‌లో పంచుకున్న ఆయన, అభిమానుల అనురాగంపై మనస్ఫూర్తిగా స్పందించారు. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమను మాటల్లో వివరించడం కష్టమని చెప్పిన అమితాబ్, ఇంతటి ఆప్యాయత తనకు ఎలా దక్కిందన్నది తనకే ఒక మిస్టరీలా అనిపిస్తోందని పేర్కొన్నారు. తాను చేసిన పనులకన్నా ఎంతో ఎక్కువగా అభిమానులు ప్రేమ చూపిస్తున్నారని, ఆ అనుబంధాన్ని జీవితాంతం మర్చిపోలేనని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. అభిమానుల ప్రేమ తనను ఎప్పటికప్పుడు వినయంగా ఉండేలా చేస్తుందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. జల్సా వద్ద కనిపించిన జనసంద్రంలో మరో ఆసక్తికర సంఘటన కూడా చోటు చేసుకుంది. ఒక అభిమాని అమితాబ్ కుమారుడు అభిషేక్ బచ్చన్ ఫోటో ఉన్న పోస్టర్‌ను పట్టుకుని, అందులో ఆయన సినిమాలను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేయడం అమితాబ్ దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పందించిన బిగ్ బీ, తండ్రిగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొడుకు ఎప్పుడూ గర్వాన్ని, గౌరవాన్ని తీసుకొస్తాడని, అటువంటి క్షణాలను చూడడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# నారీనారీ నడుమ మురారి వీడియో సాంగ్

నారీనారీ నడుమ మురారీ వీడియో సాంగ్ విడుదల ఇద్దరు భామలతో కలిసి శర్వానంద్ ఈ సంక్రాంతికి సందడి చేయనున్నారు. ఆయన ప్రధానపాత్రలో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'ఈ నారీ ఆ నారీ నడుమనే మురారి..' అంటూ సాగే వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా.. అరవింద్ ఆలపించారు. ఈ సినిమాలో శర్వానంద్‌కు జోడిగా సంయుక్త, సాక్షి వైద్య కనిపించనున్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.